E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 28-04-2025 (వారం) సోమవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




(ఎన్ఐఏ)చేతికి పహల్గాం ఉగ్రదాడి కేసు... » 2 లో

# "తెలంగాణకు నెంబర్వన్ విలన్ కాంగ్రెస్ కేసీఆర్ తీవ్ర విమర్శలు"



- 1956 నుంచి కాంగ్రెస్ కిరాతకంగా తెలంగాణపై పీడనం: కేసీఆర్ ఆరోపణలు
- ఒక్కడినే ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటం చేశాను: కేసీఆర్ జ్ఞాపకాలు
- భారాస హయాంలో సాధించిన అభివృద్ధి సాధనలు: కాళేశ్వరం నుంచి రైతుబంధువరకు
- భారాస తిరిగి అధికారంలోకి వస్తుందన్న ధీమాతో ప్రజల తరపున పోరాటం ప్రకటించిన కేసీఆర్
- ఇప్పటి ప్రభుత్వ వైఫల్యాలను ఉద్దేశించి కేసీఆర్ ఆగ్రహం

తరువాయి 2లో

## నక్సలిజాన్ని మా ప్రభుత్వం శాంతిభద్రతల అంశంగా పరిగణించదు



నక్సలిజాన్ని తమ ప్రభుత్వం సామాజిక కోణంలో మాత్రమే చూస్తుంది తప్ప శాంతిభద్రతల అంశంగా పరిగణించదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శాంతి చర్చల కమిటీ నేతలు సమావేశమయ్యారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని ముఖ్యమంత్రిని ఆ నేతలు కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.


తరువాయి 2లో

## కాంగ్రెస్‌పై కేసీఆర్ విషం కక్కారు: తెలంగాణ మంత్రుల ఫైర్



2లో

### కృనాల్ ఆల్‌రౌండ్ షో.. ఢిల్లీపై ప్రతీకారం తీర్చుకున్న ఆర్సీబీ




» 6లో

### 'ఈడీ' విచారణ: సమయం కోరిన మహేశ్‌బాబు



» 5లో

### లఖ్‌నవూను బెంబేలెత్తించిన బుమ్రా.. ముంబయి వరుసగా ఐదో విజయం




» 6లో

## క్రిమియాను ఎప్పటికీ రష్యాలో భాగంగా గుర్తించం: ఉక్రెయిన్



**ఇకపై క్రిమియా రష్యాతోనే ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఉక్రెయిన్ స్పందించింది.**


ఈకబురు, : రష్యా ఉక్రెయిన్ ల మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా, క్రిమియాపై రష్యా నియంత్రణను అమెరికా గుర్తించిందని..ఇకపై క్రిమియా రష్యాతోనే ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల స్పష్టం చేశారు. తాజాగా ఈ విషయంపై ఉక్రెయిన్ స్పందిస్తూ..అమెరికా చేసిన శాంతి ప్రతిపాదనలో క్రిమియాపై రష్యా అధికారం ఉంటుందని పేర్కొనడం తమను షాక్‌కు గురిచేసిందని పేర్కొంది. క్రిమియాను తామెన్నటికీ రష్యాలో భాగంగా గుర్తించమని..అమెరికా ప్రతిపాదనను అంగీకరించబోమని తేల్చిచెప్పింది. అమెరికా ప్రతిపాదనకు అసలు అర్థమే లేదని జెలెన్‌స్కీ పార్టీ శాసనసభ్యుడు ఒలెక్సాండర్ మెరెఝ్కో అన్నారు. క్రిమియాను రష్యా చట్టవిరుద్ధంగా ఆక్రమించుకుందని.. దానిని ఆ దేశానికి పూర్తిగా ఇచ్చేయడం అసాధ్యమని పేర్కొన్నారు.

దీనికి తమ దేశ రాజ్యాంగంలో మార్పులు చేయాల్సి ఉంటుందని.. దేశవ్యాప్తంగా ప్రజల అంగీకారం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. క్రిమియాను వదులుకోవడం అంటే తమ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి రాజకీయ ఆత్మహత్యతో సమానమని అన్నారు. దీనివల్ల ఆయన భవిష్యత్తులో ఎన్నో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. అంతేకాకుండా దీనిని తమ దేశంలో రాజద్రోహంగా పరిగణిస్తారని..ఉక్రెయిన్ ప్రభుత్వం ఎప్పటికీ అటువంటి చర్యలు తీసుకోదని అన్నారు. మరోవైపు ప్రపంచ దేశాలు..ఉక్రెయిన్ ప్రభుత్వం రాజకీయంగా ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నప్పటికీ తాము ఈ పోరాటాన్ని ఎన్నటికీ ఆపబోమని ఉక్రెయిన్ సైనిక అధికారులు పేర్కొన్నారు. ఈ యుద్ధం వల్ల ఎందరో సైనికులు ప్రాణాలు కోల్పోయారని..వారి త్యాగాలకు ఫలితం కచ్చితంగా తమ దేశ ప్రజలకు దక్కాలని అన్నారు.

తరువాయి 2లో

### పెహల్గామ్ ఉగ్రదాడి పై మన్ కీ బాత్ లో మాట్లాడిన మోడీ

» 2లో



### యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నయి

» 2లో

## తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ నివాళులు

**భారాస రజతోత్సవం సందర్భంగా తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నివాళులర్పించారు.**


ఈకబురు, హైదరాబాద్: భారాస రజతోత్సవం సందర్భంగా తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నివాళులర్పించారు. అనంతరం జలదృశ్యంలో ప్రొఫెసర్ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ ఉద్యమానికి, భారాస ప్రస్థానానికి మూలస్తంభాలని కొనియాడారు. 25 ఏళ్ల పార్టీ ప్రస్థానానికి వారి స్ఫూర్తితో పాటు అధినేత కేసీఆర్ అందించిన నాయకత్వమే ప్రధాన కారణమన్నారు. ఆనాడు ఒకరితో ప్రారంభమైన పార్టీ.. లక్షల మందితో బలోపేతమై తెలంగాణను సాధించిందన్నారు. పార్టీ పుట్టిన జలదృశ్యంలో రజతోత్సవ సంబురానికి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలర్పించిన అమరులందరికీ తలవంచి వినమ్రంగా నివాళులర్పిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.నేటి సాయంత్రం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో భారాస రజతోత్సవ సభ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే భారీగా గులాబీ శ్రేణులు అక్కడికి చేరుకుంటున్నారు. భారాస అధినేత కేసీఆర్ కీలక ప్రసంగం చేయనున్నారు.



**నిన్నటి విధ్వంసం నుంచి..రేపటి వికాసం వైపు అమరావతి ప్రయాణం మొదలవుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పనులు పునః ప్రారంభమయ్యే రోజు..రాష్ట్ర చరిత్రలోనే గొప్ప మలుపు అవుతుందన్నారు.**

### నిన్నటి విధ్వంసం నుంచి.. రేపటి వికాసం వైపు ప్రయాణం

- కుట్రలతో మన స్వప్నాన్ని దెబ్బతీయలేరని చెప్పేందుకే.. రాజధానిని దేశమంతా గుర్తించేలా..
- మోదీ చేతుల మీదుగా పనుల పునః ప్రారంభం
- ప్రధాని సభ ఏర్పాట్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు




తరువాయి 2లో

# "తెలంగాణకు నెంబర్వన్ విలన్ కాంగ్రెస్ కేసీఆర్ తీవ్ర విమర్శలు"

మొదటి పేజీ తరువాయి






**తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విలన్ నంబర్ 1 అని భారాస అధినేత కేసీఆర్ అన్నారు.**

ఈకబురు, హనుమకొండ: తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విలన్ నంబర్ 1 అని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది జవహర్‌లాల్ నెహ్రూ అయితే, 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. మళ్లీ కాంగ్రెస్ పార్టీ నిరంకుశంగా అణచివేసిందని విమర్శించారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్యానించారు. భారాస రజతోత్సవ వేడుకల సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొన్నారు. తొలుత జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వలసవాదుల విష కౌగిలిలో నలిగిపోతున్న నా భూమికి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఒక్కడినే బయల్దేరానని అన్నారు. ఆ సమయంలో కొందరు వెటకారం చేశారని, అన్నింటినీ అధిగమించి పోరాడి తెలంగాణను సాధించానని చెప్పారు. ప్రజలు దీవిస్తే పదేళ్లపాటు ధగధగలాడే తెలంగాణను తయారు చేసుకున్నామన్నారు. "1969లో మూగబోయిన తెలంగాణ ఉద్యమానికి మళ్లీ జీవం పోశాను. కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసమైన జలదృశ్యం వేదికగా తెరాస ఆవిర్భావం జరిగింది. ఉద్యమ జెండాను దించితే నన్ను రాళ్లతో కొట్టి చంపమని ఆనాడు చెప్పాను. 60 ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ ప్రజలు ఎన్ని బాధలు పడ్డారో నాకు తెలుసు. ఆనాడు కాంగ్రెస్, తెదేపాలో ఉన్న నేతలు పదవుల కోసం పెదాలు మూసుకొని కూర్చున్నారు. శాసనసభలో తెలంగాణ అనే పదమే ఉపయోగించవద్దని రూలింగ్ ఇచ్చారు. తెరాస ఏర్పాటు తర్వాత మలిదశ ఉద్యమం ఉద్ధృతమైంది. సాగరహారం, వంటావార్పు, సకల జనుల సమ్మె వంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉద్ధృతం చేశాం. సాధించుకున్న తెలంగాణలో ప్రజలు దీవించి పదేళ్లపాటు అవకాశమిస్తే.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. ప్రాజెక్టులు నిర్మించి సాగుభూమిని గణనీయంగా పెంచాం. మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాం. అద్భుతమైన తెలంగాణను నిర్మించుకున్నాం. పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండే రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం. షేర్‌షా కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చే వరకు రైతుల నుంచి ఎన్నో పన్నులు వసూలు చేశారు. వారి నుంచి పన్నులు వసూలు చేసిన వారే తప్ప.. వారికి మేలు చేసిన వాళ్లు లేరు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే పట్టించుకున్న నాథుడు లేడు.

**ఎన్నోన్నో పథకాలు అమలు చేశాం**

రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రైతుబంధు పథకం తీసుకొచ్చాను. రైతుబీమా అమలు చేసి రైతు కుటుంబాలను ఆదుకున్నాం. భారాస హయాంలో రైతుబంధు పథకం నిరాటంకంగా అమలైంది. వానాకాలం, యాసంగి పంటలకు సకాలంలో రైతుబంధు జమచేశాం. ఎన్నికల అజెండాలో చెప్పని ఎన్నో పథకాలను అమలు చేశాం. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, చేపల పెంపకం వంటివి అమలు చేశాం. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి ఉద్యోగ అవకాశాలు పెరిగేలా చేశాం. రాష్ట్రంలో 3 మాత్రమే ఉన్న వైద్య కళాశాలల సంఖ్యను 33కి పెంచాం.

**తెలంగాణకు ఏం బీమారి వచ్చింది?**

ఎన్నో అద్భుతాలు సాధించుకున్న తెలంగాణకు ఇవాళ ఏం బీమారి వచ్చింది. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు ఎన్నెన్నో చెప్పారు. దిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలు ఎన్నో హామీలిచ్చారు. పింఛను రూ.2 వేలు ఉంటే కాంగ్రెసోళ్లు రూ.4 వేలు వేస్తామన్నారు. మేం రైతుబంధు రూ.10వేలు ఇస్తే.. రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని ఒక్క సంతకంతో రద్దు చేస్తామని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామన్నారు. ఇప్పటికీ పింఛన్లు పెరగలేదు, రుణమాఫీ పూర్తి కాలేదు. ఎన్నో మాటలు చెప్పి ప్రజలను ఏమార్చారు. ఉచిత బస్సులు పెట్టి మహిళలు జుట్లు పట్టుకొని కొట్టుకునే పరిస్థితి తెచ్చారు. ప్రతి చెడు విషయానికి కేసీఆర్ కారణమని చెబుతున్నారు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు.. అప్పు పుడతలేదని దివాలా మాటలు మాట్లాడుతున్నారు. హామీల గురించి అడిగితే.. సంక్రాంతి, మార్చి అంటూ గడువులు చెబుతున్నారు. నా కళ్లముందే తెలంగాణ ఇలా అయిపోతుంటే దుఃఖం వస్తోంది. మళ్లీ కరెంట్ కోతలు, మోటార్లు కాలిపోయే రోజులు వచ్చాయి. కేసీఆర్ మంచిగా ఇచ్చిన కరెంట్‌కు ఇవాళ ఏమయిందని అడుగుతున్నాం. భూముల ధరలు ఎందుకు తగ్గాయి? నీళ్లు ఎక్కడికి పోయాయి? వడ్లు కొనే దిక్కులేదు.. కల్లాల్లో రైతులు ఏడుస్తున్నారు. 2014కు ముందున్న పరిస్థితులు మళ్లీ వచ్చాయి" అని భారాస అధినేత కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**ఇకపై బయటకు వస్తా.. ప్రజలన తరపున పోరాడతా**

" పాలన చేతకాక రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారు. 8090శాతం పూర్తయిన ప్రాజెక్టులను పూర్తి చేయకుండా పక్కన పెట్టారు. పేద మహిళల కోసం తీసుకువచ్చిన కేసీఆర్ కిట్ పథకం కూడా బంద్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొన్నాళ్లు సమయం ఇవ్వాలని ఇన్నాళ్లు బయటకు రాలేదు. ఇప్పటి నుంచి బయటకి వస్తా.. అందరి తరపున పోరాడతా. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి తెలివితో పని చేయాలి. ఎక్కడ పోగొట్టుకున్నామో మళ్లీ అక్కడే సాధించాలి. మాట్లాడితే భారాసపై నిందలు వేస్తున్నారు. భూములు అమ్మొచ్చు.. అభివృద్ధి చేయొచ్చు కానీ, ఏది అమ్మాలో విచక్షణ ఉండాలి. ఎక్కడైనా యూనివర్సిటీ భూములు అమ్ముతారా?" అని కేసీఆర్ ప్రశ్నించారు.

**రాజీవ్ ఆరోగ్యశ్రీని కొనసాగించా**

"ఎవరు తెచ్చినా.. బాగున్న పథకాన్ని కొనసాగించాలని నేను ఆనాడే చెప్పాను. వైఎస్‌ఆర్ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నేను రద్దు చేయలేదు. పేరు మార్చకుండా ఆ పథకాన్ని కొనసాగించాను. ప్రభుత్వాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వారిపై పోలీసులు కేసులు పెడుతున్నారు. పోలీసులకు చెబుతున్నా.. డైరీల్లో రాసుకోండి.. మళ్లీ వచ్చేది భారాస ప్రభుత్వమే. భారాస ప్రభుత్వాన్ని ఆపడం ఎవరి తరమూ కాదు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. భారాస ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు. కార్యకర్తలకు భారాస లీగల్ సెల్ అండగా ఉంటుంది. ఈ ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైంది. 2030శాతం కమీషన్లు తీసుకుంటూ సంచులు మోస్తోంది. అసెంబ్లీకి రావాలని నాకు సవాల్ విసురుతున్నారు. పిల్లలు అడిగితేనే చెప్పే దిక్కులేదు.. నేను కావాలా? కమీషన్ల గురించి అసెంబ్లీలో హరీశ్‌రావు ప్రశ్నిస్తే.. భుజాలు తడుముకుంటున్నారు.

**ఆపరేషన్ కగార్ ఆపేయాలి**

భాజపా వైఖరి అంతా భ్రమమానం..భజగోవిందం. శుష్క ప్రియాలు.. శూన్య హస్తాలు. ఆపరేషన్ కగార్ అనే పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనులు, యువతను ఊచకోత కోస్తున్నారు. చర్చలకు పిలవాలని నక్సలైట్లు కోరుతున్నారు. వాళ్ల విజ్ఞప్తి మేరకు నక్సలైట్లను చర్చలకు పిలవాలి. బలగాలు ఉన్నాయని అందర్నీ చంపుతూ వెళ్తే.. ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయండి. ఆపరేషన్ కగార్ ఆపాలని తీర్మానం చేసి దిల్లీకి పంపుదాం" అని

## నక్సలిజాన్ని మా ప్రభుత్వం శాంతిభద్రతల అంశంగా పరిగణించదు

మొదటి పేజీ తరువాయి



వి నతి పత్రం అందచేసిన వారిలో శాంతి చర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, దుర్గాప్రసాద్, జంపన్న, రవి చందర్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా శాంతి చర్చల కమిటీ నేతలతో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. నక్సలిజాన్ని తమ ప్రభుత్వం సామాజిక కోణంలో మాత్రమే చూస్తుంది తప్ప శాంతిభద్రతల అంశంగా పరిగణించదని ఆయన అన్నారు. గతంలో నక్సలైట్లతో చర్చలు జరిపిన అనుభవం సీనియర్ నేత జానారెడ్డికి ఉందని, ఈ అంశంపై సీనియర్ నేత జానారెడ్డి సలహాలు, సూచనలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి తెలిపారు. మంత్రులతో చర్చించి ఒక నిర్ణయాన్ని తీసుకుంటామని సీఎం తెలిపారు.

## కాంగ్రెస్‌పై కేసీఆర్ విషం కక్కారు: తెలంగాణ మంత్రుల ఫైర్



మొదటి పేజీ తరువాయి

భారాస అధినేత కేసీఆర్ మనసంతా విషంతో నిండిపోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

ఈకబురు, : కేసీఆర్ మనసంతా విషంతో నిండిపోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన ప్రసంగం మొత్తంలో కాంగ్రెస్‌ను విలన్‌లా చిత్రీకరించడం తప్ప ఇంకేమీ లేదని విమర్శించారు. మంచి సలహాలు, సూచనలు ఇస్తారేమోనని కేసీఆర్ ప్రసంగం విన్నామని, అందులో ఏమీ లేదని ఎద్దేవా చేశారు. భారాస రజతోత్సవాల సందర్భంగా ఎల్కతుర్తిలో భారాస అధినేత కేసీఆర్ చేసిన ప్రసంగంపై మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ తీరును తప్పుబట్టారు. "గత సీఎం పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైంది. అప్పులున్నా.. ప్రజలకు సంక్షేమం అందిస్తున్నాం. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరిస్తున్నారా? కడుపంతా విషం నింపుకొని కేసీఆర్ మాట్లాడటం బాధ కలిగించింది. రెండుసార్లు భారాసకు అధికారం ఇస్తే.. ఎలా కొల్లగొట్టారో ప్రజలు గమనించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి.. మంచి సలహాలు ఇస్తారని ఎదురుచూశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఐదారు పర్యాయాలు అసెంబ్లీ జరిగింది. కేవలం రెండుసార్లే కేసీఆర్ వచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు సచివాలయానికి కూడా కేసీఆర్ వెళ్లలేదు. కేసీఆర్ దొర మాదిరిగా పరిపాలిస్తే.. మా ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు అందుబాటులో ఉంది. ప్రజలకు కాంగ్రెస్ అందిస్తున్న మంచి పాలన గురించి తట్టుకోలేక కేసీఆర్ విషం కక్కారు. గతంలో వరి వేస్తే ఉరి అని చెప్పి.. కేసీఆర్ మాత్రం 150 ఎకరాల్లో వరి వేశారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు కేసీఆర్ మాట్లాడుతున్నారు. గత భారాస ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.82 వేల కోట్లు బకాయిలు పెట్టింది. సర్పంచులకు కాంగ్రెస్ బకాయిలు పెట్టిందని కేసీఆర్ అంటున్నారు. మా ప్రభుత్వం వచ్చాక సర్పంచులే లేరు. మా ప్రభుత్వంలో సర్పంచులు ఒక్క రూపాయి పని కూడా చేయలేదు. అధికారంలోకి రావాలని కేసీఆర్ పగటికలలు కంటున్నారు. భారాస సభకు ఆటంకాలు సృష్టించామని కేసీఆర్ ఆరోపించారు. సభకు అసలు ఆటంకం సృష్టించలేదు.. మేం ఇబ్బంది పెట్టి ఉంటే సభ జరిగేదా? ఆ పార్టీ నేతలు అడిగినన్ని బస్సులను సభకు పంపాం. గత సీఎం పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైంది. యూనివర్సిటీ ఆస్తులు అమ్ముతున్నామని కేసీఆర్ ఆరోపించారు. అసలు యూనివర్సిటీ ఆస్తులను మేం ఎక్కడ విక్రయించాము? ఈ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తోంది. కేసీఆర్ తెచ్చిన ధరణిలో ఎన్ని కుంభకోణాలు జరిగాయో అందరికీ తెలుసు. 'ధరణి' గురించి కేసీఆర్ ఎందుకు ప్రస్తావించలేదు. ఈ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సన్నబియ్యం గురించి ఎందుకు మాట్లాడలేదు? కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలో 8వ అద్భుతం అని చెప్పుకొన్నారు. కానీ, ఇవాళ ఆ ప్రాజెక్టు పనికిరాదని జాతీయ డ్యామ్ సేఫ్టీ కమిటీ నివేదిక ఇచ్చింది. ఏ అంశంపై ఎప్పుడు అసెంబ్లీ పెట్టమంటారో కేసీఆర్ చెప్పాలి. కేసీఆర్ చెప్పిన అంశంపై అసెంబ్లీ చర్చకు మేం సిద్ధం. భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని బీసీ నేతకు ఇవ్వాలి. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని ఉద్యమం రోజుల్లో చెప్పారు. అది ఎలాగూ చేయలేదు.. కనీసం ప్రతిపక్ష నేత హోదాను అయినా దళితుడికి ఇవ్వొచ్చు కదా..! కేసీఆర్ పగటి కలలను తెలంగాణ ప్రజలు నిజం కానివ్వరు. ఆయన పడగొడితే పడిపోవడానికి ఇది బొమ్మరిల్లు కాదు. మళ్లీ సీఎం అవుతానని భ్రమపడుతూ.. ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు" అని పొంగులేటి అన్నారు.

అధికారం పోయిందని అక్కసు: సీతక్క

అధికారం పోయిందనే అక్కసును మాజీ సీఎం కేసీఆర్ వెళ్లగక్కారని మంత్రి సీతక్క విమర్శించారు. అధికారం పోయిన తర్వాత ఆయన కుటుంబంలో చీలికలు వస్తున్నాయని బాధపడుతున్నారు తప్ప.. ప్రజల కోసం కాదని అన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లోనే 59 వేల ఉద్యోగాలు ఇచ్చింది. పార్టీ రజతోత్సవ వేళ ఎవరైనా పార్టీ త్యాగాలు, గొప్పదనాలు చెప్పుకొంటారు. కానీ, కేసీఆర్ మాత్రం కాంగ్రెస్‌ను విమర్శించేందుకే సభ పెట్టారు. పేద మహిళల కోసం ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తే.. వారిని అవమానిస్తున్నారు. కేసీఆర్ అంతదారుణంగా పోలీసు వ్యవస్థను ఇంకెవరూ వాడుకోలేదు. అధికారంలో ఉన్నన్ని రోజులూ పోలీసులను తన ఫామ్‌హౌజ్ వద్ద కాపలా ఉంచారు. ప్రజలు నిరసన తెలిపే అవకాశం లేకుండా ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్ మూసివేయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెరిపించిన ధర్నాచౌక్ వద్ద ఆయన కుమార్తె ధర్నాలు చేస్తున్నారు. అసెంబ్లీలో మాట్లాడే సమస్యలను ఉత్తికబుర్లని అవమానించారు. అలాంటి వ్యక్తికి మళ్లీ అసెంబ్లీలో అడుగు పెట్టే నైతిక హక్కు ఉందా?" అని సీతక్క ప్రశ్నించారు.

కేసీఆర్ గర్వం ఇంకా తగ్గలేదు: జూపల్లి

ప్రజలు ఓడించి ప్రతిపక్షంలో కూర్చుబెట్టినా.. కేసీఆర్‌లో ఇంకా గర్వం తగ్గలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. పార్టీ రజతోత్సవ వేదికపై కేసీఆర్ మినహా ఒక్క నేత అయినా మాట్లాడకుండా నిరంకుశంగా వ్యవహరించారని అన్నారు. భారాస నేతలు నిజాయితీపరులైతే.. ఆ పార్టీ ఖాతాలో రూ.వేల కోట్లు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. "కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీగా ఉన్న ఉద్యోగి దగ్గర ఇవాళ రూ.200 కోట్లు దొరికాయి. ఆయనే అంత సంపాదించారంటే.. కేసీఆర్ కుటుంబం ఇంకెంత దోచుకుందో అర్థం చేసుకోవాలి. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి ఇచ్చారా?పదేళ్లు ప్రైవేటు వ్యక్తి చేతిలో ఉన్న కంచ గచ్చిబౌలి భూములను ఎందుకు పట్టించుకోలేదు. బంగారు బాతులాంటి ఔటర్ రింగ్‌రోడ్డును 30 ఏళ్లకు అప్పనంగా అమ్మలేదా? ఏ తప్పూ చేయకపోతే ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులు విదేశాల్లో ఎందుకు దాక్కున్నారు?" అని జూపల్లి ప్రశ్నించారు.

కేసీఆర్ అవకాశవాది: పొన్నం ప్రభాకర్

కేసీఆర్ అవకాశవాదిలా మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. "సోనియా గాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ అనలేదా?ఇవాళ విలన్ అంటున్నారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన వారికి ఆ సభా వేదికపై ఎందుకు నివాళి అర్పించలేదు. పార్టీ పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఎవరికైనా ఇచ్చారా" అని నిలదీశారు.

## క్రిమియాను ఎప్పటికీ రష్యాలో భాగంగాగుర్తించం: ఉక్రెయిన్

దక్షిణ ఉక్రెయిన్‌లో నల్ల సముద్రం వెంబడి ఉన్న క్రిమియా వ్యూహాత్మక ప్రాంతం. 2014లో రష్యా దానిని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇదే అంశంపై మాట్లాడిన ట్రంప్.. క్రిమియా రష్యాతోనే ఉంటుందని చెప్పారు. అయితే, ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులకు పాల్పడుతుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. ఇది సరైన సమయం కాదన్నారు. వారానికి ఐదు వేల మంది సైనికులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇప్పటికైనా శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని పుతిన్‌కు సూచించారు. శనివారం వాటికన్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన అనంతరం ట్రంప్ రష్యా అధ్యక్షుడిపై విరుచుకుపడ్డారు. పుతిన్‌కు యుద్ధం ఆపాలన్న ఉద్దేశం ఉన్నట్లు కనిపించడం లేదన్న విషయం తనకు అర్థమవుతోందని అన్నారు

## ఆంధ్రులు గర్వించేలా అమరావతి

అమరావతి: నిన్నటి విధ్వంసం నుంచి..రేపటి వికాసం వైపు అమరావతి ప్రయాణం మొదలవుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పనులు పునః ప్రారంభమయ్యే రోజు..రాష్ట్ర చరిత్రలోనే గొప్ప మలుపు అవుతుందన్నారు. మే 2న రాజధానిలో ప్రధాని మోదీ పాల్గొనే సభకు సంబంధించిన ఏర్పాట్లపై మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉండవల్లిలోని నివాసంలో ఆదివారం సాయంత్రం సమీక్షించారు. 'ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన రాజధానిని వైకాపా ప్రభుత్వం విధ్వంసం చేసింది. నేడు మళ్లీ అదే ప్రధాని చేతుల మీదుగా పనులు తిరిగి ప్రారంభించి..ఒక అద్భుత రాజధానిని నిర్మించి, విధ్వంసకారులకు గట్టి సమాధానం చెబుతున్నాం' అని స్పష్టం చేశారు. 'గత ప్రభుత్వం అమరావతిని దెబ్బతీయాలని అనేక కుట్రలు దాడులు చేసింది. అయితే అన్ని ప్రాంతాలు, వర్గాల ప్రజల అభిలాషకు అనుగుణంగా ప్రారంభమైన అమరావతి.. వాటన్నింటినీ తట్టుకుని నిలబడింది. గత ప్రభుత్వ విధ్వంసం కారణంగా ఎదురైన సవాళ్లను.. కూటమి అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే పరిష్కరించి.. నిలిచిపోయిన పనుల్ని పట్టాలెక్కిస్తున్నాం' అని సీఎం వివరించారు.

ప్రధాని మోదీ పర్యటన కార్యక్రమాలపై ఉండవల్లిలో ఉన్నతాధికారులు, మంత్రులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మన ఆత్మగౌరవం, ఆకాంక్ష.. సెంటిమెంట్స్ది ఆంధ్రప్రదేశ్, నా రాజధాని అమరావతి అని రాష్ట్రంలోని ప్రతి పౌరుడూ చెప్పేలా అమరావతి నిర్మాణం జరుగుతోందని చంద్రబాబు తెలిపారు. ప్రధాని కూడా రాజధాని నిర్మాణంపై ఎంతో ఆసక్తితో ఉన్నారని.. దిల్లీ భేటీ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారని వివరించారు. 'అమరావతి అనేది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవం, ఆకాంక్ష, సెంటిమెంట్.. దీన్ని ఎవరూ దెబ్బ తీయలేరు. అమరావతి సంపద సృష్టి కేంద్రంగా, అన్ని వర్గాల ప్రజలకూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాంతంగా మారుతుంది. ప్రజారాజధాని అనే ఆంధ్రుల స్వప్నాన్ని కుట్రలు, కుతంత్రాలతో ఎవరూ దెబ్బతీయలేరని చెప్పేందుకే.. మళ్లీ దేశం అంతా గుర్తించేలా అమరావతి పనులను ప్రధాని చేతుల మీదుగా పునఃప్రారంభింపజేస్తున్నాం' అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా, వేడుకగా నిర్వహించాలని ఆదేశించారు. ఆహారం, తాగునీరందించాలి.. రాజధాని పనుల పునః ప్రారంభ సభకు హాజరయ్యే ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని.. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులు ఆయనకు ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 'ఎండల తీవ్రత దృష్ట్యా దూర ప్రాంతాల నుంచి సభకు వచ్చే వారికి తాగునీరు, ఆహారం అందించాలి. భద్రతాపరంగా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి. సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా వేదిక వద్దకు చేరుకోవాలి. ముఖ్యంగా రాజధాని ప్రాంతంలోని గ్రామాల ప్రజలకు ఎక్కువ భాగస్వామ్యం ఉంటుంది. వారంతా సభకు రావాలని భావిస్తారు. రవాణా సహా ఇతర అంశాలపై ఎప్పటికప్పుడు వారికి సూచనలు, ప్రకటనలు చేయాలి. వారికి ఇబ్బంది కలగకుండా చూడాలి' అని సూచించారు. సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, నారాయణ, కొల్లు రవీంద్ర, మనోహర్, సత్యకుమార్‌తోపాటు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, వివిధ శాఖల అధికారులు

## యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నయి

**15వ రోజ్‌గార్ మేళాలో ప్రధాని నరేంద్ర మోదీ**

న్యూఢిల్లీ: దేశంలో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెరగడానికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 15 రోజ్‌గార్ మేళా పురస్కరించుకొని శనివారం నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలలో నియామకాలకు సంబంధించి 51 వేల మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు పంపిణీ చేశారు. అనంతరం మోదీ మాట్లాడుతూ ఇండియా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) పేర్కొందని చెప్పారు. ఇది యువతకు అపూర్వమైన అవకాశాల సమయమని తెలిపారు. ప్రతి రంగంలోనూ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.

**కొత్త శిఖరాలకు మహిళా శక్తి**

స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలు ప్రతిభను ప్రదర్శించడానికి యువతకు ఓపెన్‌ప్లాట్‌ఫామ్‌ను అందిస్తున్నాయని ప్రధాని అన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేసే అవకాశాన్ని కల్పించడం లక్ష్యంగా ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రభుత్వం "మాన్యుఫ్యాక్చరింగ్ మిషన్"ను ప్రకటించిందని చెప్పారు. "మాన్యుఫ్యాక్చరింగ్ మిషన్ లక్షలాది ఎంఎస్‌ఎంఈలు, చిన్న పారిశ్రామికవేత్తలకు సపోర్టు ఇవ్వడమే కాకుండా దేశవ్యాప్తంగా కొత్త ఉపాధి మార్గాలను కూడా తీసుకొస్తుంది" అని మోదీ అన్నారు. దేశంలో ఇంక్లూజివ్‌గ్రోత్ అనేది ఒక పెద్ద ప్రధానాంశమని, ప్రతి రంగంలోనూ మహిళల భాగస్వామ్యం పెరిగిందన్నారు. ఈ సంవత్సరం యూపీఎస్సీ పరీక్షలో ఐదుగురు టాపర్లలో ముగ్గురు మహిళలు ఉన్నారని, 90 లక్షలకు పైగా స్వయం సహాయక గ్రూపుల్లో 10 కోట్లకు పైగా మహిళలు పనిచేస్తున్నారని ఆయన అన్నారు. బ్యూరోక్రసీ నుంచి అంతరిక్షం, విజ్ఞాన శాస్త్రం వరకు రంగాలలో ఇండియా మహిళా శక్తి కొత్త శిఖరాలను అధిరోహిస్తున్నదని, గ్రామీణ మహిళల సాధికారతపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. ఈ దశాబ్దంలో టెక్నాలజీ, డేటా, ఇన్నొవేషన్స్‌లో ఇండియా గ్రోత్‌యువత ఎంతో శక్తినిచ్చిందని తెలిపారు.



## పెహల్గామ్ ఉగ్రదాడిపై మన్ కీ బాత్ లో మాట్లాడిన మోడీ

ఈకబురు: ప్రధాని నరేంద్ర మోడీ మన్ కీ బాత్ లో పెహల్గాం ఉగ్రదాడి గురించి ప్రస్తావించారు. ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమం 121వ ఎపిసోడ్‌లో మోడీ పెహల్గామ్ ఉగ్రదాడి గురించి మాట్లాడారు. ఈ దాడి తనను ఎంతగానో కలచి వేసిందని.. ప్రతి భారతీయుడి రక్తం మరిగిపోతుందని అన్నారు. ఈ సంక్షోభ సమయంలో దేశం ఐక్యంగా ఉండాలని చెప్పుకొచ్చారు. ఈ దాడి ముష్కరుల నిరాశ, పిరికితనాన్ని చూపిస్తుందన్నారు. "కశ్మీర్‌లో శాంతి స్థాపన జరుగుతోంది. స్కూల్స్, కాలేజీలు కళకలలాడుతున్నాయి. అభివృద్ధి పనులు వేగంగా జరుగుతుంది. ప్రజాస్వామ్యం బలపడుతోంది. పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుదల ఉంది. ప్రజల ఆదాయాలు పెరుగుతున్నాయి. యువతకు కొత్త అవకాశాలు పుట్టుకొస్తున్నాయి. దేశ శత్రువులు, జమ్ముకశ్మీర్ లో ఇవన్నీ జరగటాన్ని ఇష్టపడట్లేదు" అని మోడీ అన్నారు. జమ్ముకశ్మీర్ అద్భుతంగా పురోగతిని సాధించడాన్ని చూసి ఓర్చుకోలేని ఉగ్రవాదులు దానిని దెబ్బతీసేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందడాన్ని తట్టుకోలేక అమాయకులపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

## (ఎన్ఐఏ) చేతికి పహల్గాం ఉగ్రదాడి కేసు..

**పహల్గాం ఉగ్రదాడి కేసును జమ్మూ కశ్మీర్ పోలీసుల నుంచి జాతీయ దర్యాప్తు సంస్థ అధికారికంగా తీసుకుంది.**

ఈకబురు,: పహల్గాం ఉగ్రదాడి ఘటనపై భారత భద్రతా బలగాలు, జమ్మూకశ్మీర్ పోలీసులు.. సంయుక్తంగా దర్యాప్తు చేస్తున్నాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (MHA) ఆదేశాల మేరకు తాజాగా ఈ కేసును జమ్మూకశ్మీర్ పోలీసుల నుంచి జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) అధికారికంగా తీసుకుంది. ఉగ్రదాడి జరిగిన తర్వాత ఎన్ఐఏ బృందాలు పహల్గాంలో విచారణను ప్రారంభించాయి.

ఘటన జరిగిన సమయంలో ఉగ్రవాదులను చూసిన పర్యాటకులను పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఉగ్రవాద నిరోధక సంస్థకు చెందిన పోలీసు సూపరింటెండెంట్ పర్యవేక్షణలో విచారిస్తున్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. అక్కడ వారు తీసుకున్న ఫొటోలు, వీడియోలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. పర్యటన సమయంలో ఎవరైనా అనుమానితులను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పహల్గాంలోకి ప్రవేశించే, నిష్క్రమించే ప్రాంతాల్లో ఫోరెన్సిక్ బృందం సహాయంతో తనిఖీలను ముమ్మరం చేశామన్నారు.

బైసరన్ ప్రాంతంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ముష్కరులు కాల్పులు జరిపిన విషయం తెలుసుకొని తొలుత సీఆర్పీఎఫ్ (CRPF) క్విక్ యాక్షన్ టీమ్ స్పందించింది. 25 మంది కమాండోలతో కూడిన బృందం రాళ్లు, బురద మార్గంలో దాదాపు 4045 నిమిషాలు ట్రెక్కింగ్ చేసి ఘటనాస్థలానికి చేరుకుంది. వెంటనే పహల్గాం చుట్టూ సీఆర్పీఎఫ్ యూనిట్ చెక్‌పోస్టులు, ఘటనాస్థలానికి సమీపంలో సురక్షిత పాయింట్లను ఏర్పాటు చేసింది. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకొని పర్యాటకులను ఇతర ప్రాంతాలకు తరలించారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కదిలిన శేరిలింగంపల్లి దండు



జెండా ఊపి ర్యాలీగా బహిరంగ సభకు తరలివెళ్తున్న సాయిబాబా తదితరులు



పార్టీ శ్రేణులతో కలిసి బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న సాయిబాబా

**ఖాజాగూడలో పండుగలా బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ**

**సాయిబాబా ఆధ్వర్యంలో తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు**

ఈ,కబురు, శేరిలింగంపల్లి : వరంగల్ లో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఎత్తున తరలివెళ్లారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ నుంచి శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా బస్సులు, కార్ల ర్యాలీని సాయిబాబా జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు బీఆర్ఎస్ పార్టీ జండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. వేల మంది కార్యకర్తల సమక్షంలో పార్టీ జెండాను ఎగురవేసిన సాయిబాబా బీఆర్ఎస్ శ్రేణులకు రజతోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ నేడు రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలనను ఎంతగా కోరుకుంటున్నారో బహిరంగ సభకు ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూస్తే అర్థం అవుతుందన్నారు. వరంగల్ రజతోత్సవ సభ కోసం శేరిలింగంపల్లి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఏడాదిన్నర పాలనపై తెలంగాణ రాష్ట్రం ప్రజలు పూర్తిగా విసుగు చెందారని అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచిందని, ఏ ఒక్క హామీ అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ దశాబ్దాల తెలంగాణ రాష్ట్ర ప్రజల కలను సాకారం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పెట్టిందన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం పదేళ్లపాటు అభివృద్ధి పథంలో తీసుకువెళ్లిన ఘనత కేసిఆర్ దేనిని తెలిపారు. నేడు తెలంగాణ రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని, రాష్ట్రంలో భవిష్యత్తులో ఏ ఎన్నిక జరిగినా బీఆర్ఎస్ పార్టీ అఖండ విజయం ఖాయమన్నారు. బహిరంగ సభకు తరలి వెళ్లిన వారిలో శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమకారులు ఉన్నారు.

# పహల్గామ్ మృతులకు ఘన నివాళి..



పహల్గామ్ మృతులకు నివాళ్లు అర్పిస్తున్న లక్ష్మీవిహార్ కాలనీ వాసులు



క్యాండిల్ మార్చ్ నిర్వహిస్తున్న లక్ష్మీవిహార్ ఫేజ్ వన్ కాలనీ వాసులు

## క్యాండిల్ మార్చ్ నిర్వహించిన లక్ష్మీవిహార్ కాలనీ వాసులు

ఈకబురు, పటాన్‌చెరు : టెర్రర్ అటాక్‌లో అసువులు బాసిన పహల్గామ్ మృతులకు నల్లగండ్ల లక్ష్మీవిహార్ ఫేజ్ వన్ కాలనీ వాసులు ఆదివారం ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మహిళలు, యువకులు, వృద్ధులు, చిన్నారులు సైతం రాత్రి క్యాండిల్ మార్చ్ నిర్వహించారు. వారికి సంతాపంగా కాలనీలోని రోడ్లపై మార్చ్ నిర్వహిస్తూ టెర్రరిస్టుల చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భూషన్ మాట్లాడుతూ పాకిస్తాన్ టెర్రరిస్టులు పిరకి పందల్లా అమాయక టూరిస్టులపై దాడి చేయడం హేయమన్నారు. భారతీయులంతా ఐకమత్యంగా ఉన్నారని తీవ్రవాదులు ఎన్ని కుట్రలు పన్నినా హిందువుల ఐక్యతను చెదపలేరని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారితో పాటు కాశ్మీర్‌లో దాక్కున్న తీవ్రవాదులను భయటకు లాగి చంపాలని డిమాండ్ చేశారు. భారతీయులంతా తీవ్రవాద రహిత దేశ నిర్మాణాన్ని కోరుకుంటున్నారని దానికోసం ప్రతి భారత పౌరుడు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కన్నప్ప, మణికంఠ, రేవణప్ప, రవి, పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పహల్గామ్ మృతులకు నివాళులర్పించిన బీఆర్ఎస్ శ్రేణులు

## పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి : కొమిరిశెట్టి సాయిబాబా

ఈకబురు, శేరిలింగంపల్లి : జమ్మూ కాశ్మీర్ పెహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ శ్రేణులు నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు దేశమంతా అండగా ఉంటుందని సంఘీభావం తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడలో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెహల్గాం ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ పాకిస్తాన్ ముర్దాబాద్.. ఇండియా జిందాబాద్... వి వాంట్ రివేంజ్... అంటూ నినాదాలు చేశారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ లోని పెహల్గాంలో పర్యాటకుల మీద ఉగ్రవాదులు జరిపిన దాడి హేయమన్నారు. ఉగ్రదాడిలో 30 మంది అమాయక ప్రజలు మృతి చెందడం దేశాన్ని శోకసంద్రంలో ముంచిందని అన్నారు. మరోసారి దేశంలో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో పెకిలించాల్సిన సమయం ఆసన్నమైందని, కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలకు దేశమంతా అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా ప్రదర్శన నిర్వహిస్తున్న సాయిబాబా తదితరులు

# ప్రధాని 'మన్ కీ బాత్' ను కార్యకర్తలతో వీక్షించిన కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



కార్యకర్తలతో కలిసి మన్ కీ బాత్ ను వీక్షిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



కార్యకర్తలతో కలిసి మన్ కీ బాత్ ను వీక్షిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

ఈకబురు, శేరిలింగంపల్లి : ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 121 వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి పార్టీ కార్యకర్తలతో కలిసి వీక్షించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో గల గచ్చిబౌలి డివిజన్ బీజేపీ పార్టీ కార్యాలయంలో గచ్చిబౌలి డివిజన్ నాయకులు, బూత్ కమిటి సభ్యులు, కార్యకర్తలతో కలిసి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మన్ కీ బాత్ ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో పహల్గామ్ ఉగ్రదాడిపై మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రదాడి వెనుక ఉన్నవారికి కఠిన శిక్ష తప్పదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి భారతీయుడి రక్తం మరుగుతోందని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో 140 కోట్ల భారతీయుల బలం మనకు ఉందని, ఈ పోరులో అందరూ కలిసి పోరాడాలని ఆయన పిలుపు ఇచ్చారు. ప్రపంచం మొత్తం మనవైపే ఉందని, ఈ దాడి మన సంస్కృతి, విలువలు, మానవత్వంపై దాడి చేసినట్లుగా భావిస్తున్నామని, భారతీయులుగా మనం ఎప్పటికీ శాంతియుత జీవితం కోరుకుంటామన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పెహల్గాం లో జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్య అని అన్నారు. పర్యాటకులను హిందువులని గుర్తించి కాల్చి చంపడం భారతీయుల రక్తాన్ని మరిగిస్తుందని, ఈ దాడికి కేంద్ర ప్రభుత్వం తప్పకుండా బదులు తీర్చుకుంటుందని అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో పెకిలించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివసింగ్, సీనియర్ నాయకులు వసంత కుమార్ యాదవ్, నరసింహ రావు, వరలక్ష్మి ధీరజ్, రంజిత్ పూరి, శ్రీకాంత్ రెడ్డి, బబ్లు సింగ్, గోపాల్ తో పాటు,బూత్ కమిటి సభ్యులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# హుడా కాలనీలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో డాక్టర్లు చేపడుతున్న పరీక్షలను పరిశీలిస్తున్న రామస్వామి యాదవ్

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని చందానగర్ హుడా కాలనీ ఫేస్ 2లో ఆదివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. హుడా కాలనీ కమ్యూనిటీ హాల్ లో చందానగర్ మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. వైద్య శిబిరంలో ఎత్తు, బరువు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్తపోటు, షుగర్, పల్స్, ఈసీజీ, బిఎంటి తదితర పరీక్షలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ఆదిత్య, డాక్టర్ నవీన్, డాక్టర్ శిరీష లు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిపోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ మారిన జీవనశైలిలో పర్యావరణంలో వస్తున్న అనేక మార్పులవల్ల ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరు నిత్యం వ్యాయామం, యోగ, ధ్యానము, నడక అలవాటు చేసుకోవాలని, కనీసం రోజు 40 నిమిషాలు వ్యాయామానికి కేటాయించాలన్నారు. సాధ్యమైనంత వరకు తాజా ఆకుకూరలు, సీజనల్ ఫ్రూట్స్, పాలు, పాల ఉత్పత్తులు, చేపలు, గ్రుడ్లు, తృణధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకొని, ఆరోగ్యం కాపాడుకోవాలని తెలిపారు. సాధ్యమైనంత మేరకు ఆల్కహాల్, పొగాకు, పొగాకు ఉత్పత్తులు, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చందానగర్ హుడాకాలనీ పేస్ II వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రాజయ్య, రమణారెడ్డి, సిద్దిరాములు, రామరాజు, విద్యాసాగర్, రామిరెడ్డి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కొక్కుల జనార్ధన్, కౌడిన్యశ్రీ నందూరి వెంకటేశ్వరరాజు, పాలం శ్రీనివాస్, శివరామిరెడ్డి, పకీరయ్య, ఊరిటి వెంకటరావు, హాస్పిటల్ ప్రతినిధి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లికి బంగారం ఏం కొనగలం



**దేశంలో పసిడి ధరలు రికార్డు గరిష్ఠాలకు చేరాయి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్ష సమీపంలో కదలాడుతోంది.**

## పెరిగిన ధరలతో మహిళల ఆవేదన

దిల్లీ: దేశంలో పసిడి ధరలు రికార్డు గరిష్ఠాలకు చేరాయి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్ష సమీపంలో కదలాడుతోంది. పసిడి ధరలు ఒక్కసారిగా ఈ స్థాయికి పెరగడం మార్కెట్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ ధరల ప్రభావం సాధారణ ప్రజలపై బాగానే పడింది. బంగారు ఆభరణాలు కొనుగోలు చేద్దామని ఆశపడ్డ మహిళలు, వెనకడుగు వేసే పరిస్థితి నెలకొంది. సాధారణంగా అక్షయ తృతీయ, పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా దేశీయంగా పసిడి కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈసారి అధిక ధరల కారణంగా మధ్యతరగతి కుటుంబాలు ఈ కొనుగోళ్లకు దూరంగా ఉంటాయనే అభిప్రాయం వ్యాపార వర్గాల్లో ఉంది.

పండగలు, కుటుంబ వేడుకలకు పసిడి ఆభరణాలను కొనుగోలు చేయడం మహిళలకు పరిపాటే. ధర ఎంత ఉన్నా, వేడుకల సందర్భంగా కొత్త ఆభరణాలు కొనుగోలు చేయకుంటే వెలితిగా భావిస్తుంటారు. 'నవంబరులో మా కుమార్తె పెళ్లి ఉంది. ఇప్పుడు ఒక్కసారిగా పసిడి ధరలు పెరిగాయి. ఇక పెళ్లికి బంగారం ఏం కొనగలం' అని ఒక మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకు ముందు 10 గ్రాములు ఆభరణం కొనుగోలు చేస్తే, ఈసారి 5 గ్రాముల్లోనే సరిపెట్టుకోవాల్సి వస్తుందని మరో మహిళ పేర్కొన్నారు.
గత ఏడాది డిసెంబరు నుంచి చూస్తే.. 10 గ్రాముల పసిడి ధర దాదాపు రూ.22,650 (29%) పెరిగింది. షేర్లు, బాండ్లు కంటే పసిడి మంచి ప్రతిఫలాన్ని ఇచ్చిందని నిపుణులు చెబుతున్నారు. భారత్‌లో పసిడిని ఆభరణాలుగా మాత్రమే కాకుండా.. పెట్టుబడికి, అత్యవసరాల్లో ఆదుకునే ఆర్థిక వనరుగా పరిగణిస్తున్నారు. భారత మహిళల వద్ద దాదాపు 24,000 టన్నుల పసిడి ఉందని ప్రపంచ స్వర్ణ మండలి అంచనా వేస్తోంది. ప్రపంచం మొత్తంమీద ఆభరణాల రూపంలో ఉన్న పసిడి నిల్వల్లో మనదేశ వాటా 11 శాతం.

అక్షయ తృతీయకు తేలికపాటి ఆభరణాలకే గిరాకీ

పసిడి ధరలు రికార్డు స్థాయిలకు చేరడంపై వర్తకుల్లో కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. దుకాణాలను కొనుగోలుదారులు వస్తున్నా, కొనుగోళ్లలో భారీగా క్షీణత తప్పదని అంచనా వేసుకుంటున్నారు. ఈ ఏడాది అక్షయ తృతీయ (ఈనెల 30)కు తేలికపాటి ఆభరణాలు, ఇతర వస్తువులకే గిరాకీ ఉండొచ్చని విక్రేతలు అంచనా వేస్తున్నారు. 'అక్షయ తృతీయ రోజు పసిడి కొనుగోలు చేయడాన్ని శుభసూచకంగా భావిస్తారు. భారత సంస్కృతి సాంప్రదాయాల్లో దీనికి ప్రత్యేకత ఉంది. సాధారణంగానే ఆ రోజు పసిడి విక్రయాలు అధికంగా నమోదవుతాయి. ఈసారి అధిక ధరల కారణంగా తేలికపాటి ఆభరణాలకైనా గిరాకీ లభిస్తుందని భావిస్తున్నాం' అని ఆలిండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) ఛైర్మన్ రాజేశ్ రోక్డే తెలిపారు.

# ఈ స్కిల్స్ కావాలి.. డిమాండ్ ఉన్న టాప్ 10 ఏఐ ఉద్యోగ నైపుణ్యాలు ఇవే..





ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఉద్యోగ మార్కెట్ అనూహ్యమైన వృద్ధిని సాధిస్తోంది. యునైటెడ్ స్టేట్స్‌లో 2024లో ఏఐ జాబ్ పోస్టింగ్‌లలో 20% పెరుగుదల నమోదైందని లైట్‌కాస్ట్ నిర్వహించిన 2025 AI ఇండెక్స్ రిపోర్ట్ తెలిపింది. 109 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులతో ఊపందుకున్న ఈ మార్కెట్, ప్రత్యేక ఏఐ నైపుణ్యాల డిమాండ్‌ను పెంచుతూ ఉద్యోగ రంగాన్ని పునర్నిర్మిస్తోంది. పైథాన్ అత్యంత డిమాండ్ ఉన్న నైపుణ్యంగా నిలిచింది. గత సంవత్సరం దాదాపు 200,000 ఉద్యోగ పోస్టింగ్‌లలో ఈ నైపుణ్యాన్ని అడిగారు. రిపోర్ట్ ప్రకారం.. పైథాన్, ప్రోగ్రామింగ్, డేటా సైన్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌తో పాటు అధిక డిమాండ్ ఉన్న టాప్ 10 ఏఐ ఉద్యోగ నైపుణ్యాలు ఇవే..

☐పైథాన్ (199,213 పోస్టింగ్‌లు, 20122014తో పోలిస్తే 527% వృద్ధి)
☐కంప్యూటర్ సైన్స్ (193,341 పోస్టింగ్‌లు, 131% వృద్ధి)
☐డేటా అనాలిసిస్ (128,938 పోస్టింగ్‌లు, 208% వృద్ధి)
☐SQL (119,441 పోస్టింగ్‌లు, 133% వృద్ధి)
☐డేటా సైన్స్ (110,620 పోస్టింగ్‌లు, 833% వృద్ధి)
☐ఆటోమేషన్ (102,210 పోస్టింగ్‌లు, 361% వృద్ధి)
☐ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ (101,127 పోస్టింగ్‌లు, 87% వృద్ధి)
☐అమెజాన్ వెబ్ సర్వీసెస్ (100,881 పోస్టింగ్‌లు, 1,778% వృద్ధి)
☐అజైల్ మెథడాలజీ (88,141 పోస్టింగ్‌లు, 334% వృద్ధి)
☐స్కేలబిలిటీ (86,990 పోస్టింగ్‌లు, 337% వృద్ధి)

కింగ్ 'పైథాన్'
పైథాన్ బహుముఖ ప్రజ్ఞ, విస్తృత లైబ్రరీలు దీనిని ఏఐ అభివృద్ధిలో కీలకమైన అంశంగా మార్చాయని స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో డేటా సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎమిలీ చెన్ అన్నారు. "మెషిన్ లెర్నింగ్ నుండి ఆటోమేషన్ వరకు, పైథాన్ అనివార్యం" ఆమె తెలిపారు.
డేటా సైన్స్ (833% వృద్ధి), అమెజాన్ వెబ్ సర్వీసెస్ (1,778% వృద్ధి) వంటి నైపుణ్యాలు అత్యధిక వృద్ధిని సాధించాయి, ఇవి సంక్లిష్ట డేటాసెట్‌ల నుండి సమాచారాన్ని సంగ్రహించే, స్కేలబుల్ ఏఐ సిస్టమ్‌లను నిర్మించే నైపుణ్యాల అవసరాన్ని సూచిస్తున్నాయి. అజైల్ మెథడాలజీ (88,141 పోస్టింగ్‌లు) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో ఇటరేటివ్ విధానాలకు ఉన్న ప్రాధాన్యతను హైలైట్ చేస్తుంది.
ఈ డిమాండ్ విస్తరణ టెక్ దిగ్గజ కంపెనీల నుండి స్టార్టప్‌ల వరకు వివిధ రంగాలలో అవకాశాలను సృష్టిస్తోంది. "కంపెనీలు AIని సమగ్రపరచడానికి పోటీపడుతున్నాయి, దీనికి నైపుణ్యం కలిగిన నిపుణులు అవసరం," అని సిలికాన్ వ్యాలీలో టెక్ రిక్రూటర్ మార్క్ రివెరా అన్నారు. అయితే, ఈ వేగవంతమైన వృద్ధి నైపుణ్యాల అంతరాన్ని గురించి ఆందోళనలను లేవనెత్తింది. కొందరు నిపుణులు విద్యా సంస్థలు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కరికులమ్‌ను సవరించాలని సూచిస్తున్నారు.

ఏఐ రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో డిమాండ్ ఉన్న ఈ స్కిల్స్‌లో నైపుణ్యం కలిగిన ఉద్యోగార్థులు ఏఐ జాబ్ బూమ్‌ను సద్వినియోగం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ రంగంలోకి ప్రవేశించాలనుకునే వారికి పైథాన్, డేటా సైన్స్‌లో నైపుణ్యం సాధించడం ఏఐలో లాభదాయకమైన కెరీర్‌కు కీలకంగా మారవచ్చు.

## పాక్ గగనతలం మూసివేత.. విమానయాన సంస్థలకు డీజీసీఏ అడ్వైజరీ



**భారత్‌కు చెందిన విమానాలు రాకుండా పాకిస్తాన్ గగనతలం మూసివేసిన నేపథ్యంలో విమానయాన సంస్థలకు డీజీసీఏ అడ్వైజరీ జారీ చేసింది.**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాక్ మధ్య ద్వైపాక్షిక ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈక్రమంలో భారత్‌కు చెందిన విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇటీవల పాకిస్థాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విమానయాన సంస్థలకు పలు సూచనలు జారీ చేసింది.

పాక్ గగనతలం మూసివేత కారణంగా ఎయిర్‌లైన్ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయని డీజీసీఏ పేర్కొంది. అంతర్జాతీయ విమానాల రాకపోకలకు ప్రయాణ సమయం పెరగనున్నట్లు తెలిపింది. ఈక్రమంలోనే విమానయాన సంస్థలకు పలు అడ్వైజరీలు జారీ చేసింది. విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ప్రయాణికులకు అందించాలని సూచించింది. అంతేకాక.. విమానాల్లో ప్రయాణికులకు భోజనం, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సదుపాయం, కస్టమర్‌కేర్ సర్వీసులతో సహా ఇతర సదుపాయాలను అందుబాటులో ఉంచాలని పేర్కొంది.

భారత్‌లో పని చేసే జనాభా కంటే వేగంగా ఉద్యోగాల పెరుగుదల: ప్రపంచ బ్యాంకు
పహల్గాం లో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో భారత్, పాక్‌ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది దేశం అక్కసు వెళ్లగక్కుతూ.. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది.

## హెచ్‌పీ నుంచి 9 కొత్త ఏఐ ల్యాప్‌టాప్‌లు



న్యూఢిల్లీ: కృత్రిమ మేథకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కంప్యూటర్స్ తయారీ దిగ్గజం హెచ్‌పీ తాజాగా తొమ్మిది ల్యాప్‌టాప్ మోడల్స్‌ను ఆవిష్కరించింది. వీటి ధర రూ. 78,999 (16 అంగుళాల హెచ్‌పీ ఆమ్నిబుక్5 నుంచి రూ. 1.86 లక్షల వరకు (హెచ్‌పీ ఆమ్నిబుక్ అల్ట్రా 14 అంగుళాలు) ఉంటుంది.

మరోవైపు, భారత్‌లో తమ ఉత్పత్తుల తయారీని 2031 నాటికి రెట్టింపు చేసుకునే యోచనలో ఉన్నట్లు సంస్థ తెలిపింది. దీనితో భారత్‌లో విక్రయించే ప్రతి మూడు హెచ్‌పీ పీసీల్లో ఒకటి ఇక్కడ తయారు చేసినదే ఉంటుందని సంస్థ భారత విభాగం సీనియర్ డైరెక్టర్ వినీత్ గెహానీ తెలిపారు.

2025లో భారత్‌లో తాము విక్రయించే మొత్తం పీసీల్లో 13 శాతం దేశీయంగా ఉత్పత్తి చేసినవే ఉంటాయని వివరించారు. 2024లో దేశీ పీసీ మార్కెట్లో 30.1 శాతం వాటాతో హెచ్‌పీ అగ్రస్థానంలో నిల్చింది. కంపెనీ తమ ల్యాప్‌టాప్‌ల కోసం ఎలక్ట్రానిక్స్ తయారీ సర్వీసుల కంపెనీలు డిక్సన్, వీవీడీఎన్‌తో జట్టు కట్టింది.

# ఆర్‌ఐఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అనంత్ అంబానీ




**ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్(ఆర్‌ఐఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించారు. మే 1 నుంచి అయిదేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారని కంపెనీ తెలిపింది.**

దిల్లీ: ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించారు. మే 1 నుంచి అయిదేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారని కంపెనీ తెలిపింది. వారసత్వ ప్రణాళికలో భాగంగా 2023 ఆగస్టులో ముకేశ్ అంబానీ తన ముగ్గురు పిల్లలు ఈశా, ఆకాశ్, అనంత్‌లను ఆర్‌ఐఎల్ బోర్డులో నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా చేర్చుకున్నారు. ముకేశ్ పెద్ద కుమారుడు ఆకాశ్ 2022 జూన్ నుంచి టెలికాం అనుబంధ సంస్థ జియో ఇన్ఫోకామ్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఈశా రిటైల్, ఇకామర్స్, లగ్జరీ వ్యాపారాలను చూస్తున్నారు. అనంత్ కొత్త ఇంధన వ్యాపారాలను చూసుకుంటున్నారు. టెలికాం, రిలయన్స్ డిజిటల్ ప్రోపర్టీస్‌ను నిర్వహిస్తున్న జియో ప్లాట్‌ఫామ్స్, రిలయన్స్ రిటెయిల్ బోర్డుల్లో ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ నెల 25న జరిగిన ఆర్‌ఐఎల్ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో మానవ వనరులు, నామినేషన్‌రెమ్యునరేషన్ కమిటీ సిఫారసు మేరకు అనంత్ అంబానీని నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నుంచి పూర్తి కాల డైరెక్టర్‌గా తీసుకుని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా 2025 మే 1 నుంచి అమల్లోకి వచ్చేలా నియమించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ సమాచారమిచ్చింది.

అనంత్ అంబానీ బ్రౌన్ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియామకం అయిన ముకేశ్ వారసుల్లో ఈయనే తొలి వ్యక్తి. 2022 ఆగస్టులో రిలయన్స్ ఎనర్జీ వర్టికల్ నాయకుడిగా అనంత్‌ను నియమించారు. 2020 మార్చి నుంచి జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డులో ఉన్నారు. 2022 మే నుంచి రిలయన్స్ రిటెయిల్ వెంచర్స్ బోర్డులో ఉన్నారు. 2021 జూన్ నుంచి రిలయన్స్ న్యూ ఎనర్జీ, రిలయన్స్ న్యూ సోలార్ ఎనర్జీ బోర్డుల్లోనూ ఉన్నారు. 2022 సెప్టెంబరు నుంచి రిలయన్స్ ఫౌండేషన్ బోర్డులో కొనసాగుతున్నారు.

# భారత్ వృద్ధికి క్రూడాయిల్ దన్ను



**ఈసారి 6.5 శాతంగా ఈవై అంచనాలు**

**ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గుదల, వినియోగ వృద్ధి సానుకూలాంశాలు**

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధ భయాలు నెలకొన్నప్పటికీ తగ్గిన క్రూడాయిల్ రేట్లతో దేశీయంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు నెమ్మదించడం, దేశీయంగా వినియోగం పెరగడం లాంటి దేశ వృద్ధికి సానుకూలంగా దోహదపడనున్నాయి. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండొచ్చని కన్సల్టెన్సీ సంస్థ ఈవై ఒక నివేదికలో పేర్కొంది. ఎగుమతుల క్షీణత, గ్లోబల్ మందగమనం, ముడిచమురు ధరల తగ్గుదల, అంతర్జాతీయంగా ఉత్పత్తి సామర్థ్యాలు పెరిగిపోవడం వంటి అంశాలు భారత వృద్ధిపై ప్రభావం చూపనున్నాయని వివరించింది. సముచిత ఆర్థిక, ద్రవ్య విధానాలతో రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం లోపునకు కట్టడి చేస్తూ, 2026 ఆర్థిక సంవత్సరంలోను, అలాగే మధ్యకాలికంగాను భారత్ 6.5 శాతం వృద్ధి రేటు నమోదు చేయొచ్చని ఈవై ఇండియా చీఫ్ పాలసీ అడ్వైజర్ డీకే శ్రీవాస్తవ చెప్పారు. 'అంతర్జాతీయంగా క్రూడాయిల్ రేట్లు బ్యారెల్‌కు 60-65 డాలర్ల శ్రేణిలో ఉండొచ్చని, ఇది భారత్‌కు సానుకూలంగా పరిణమించగలదని అంచనా వేస్తున్నాం' అని వివరించారు. వివిధ అంతర్జాతీయ సంస్థలు అంచనా వేసిన 6.2-6.7 శాతం వృద్ధి రేటు శ్రేణిలోనే ఈవై అంచనాలు ఉండటం గమనార్హం. టారిఫ్‌ల యుద్ధం, అమెరికా వాణిజ్య విధానంపై అనిశ్చితి నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం భారత్ వృద్ధిరేటు 6.2 శాతం ఉంటుందని ఐఎంఎఫ్, 6.3 శాతం ఉంటుందని వరల్డ్ బ్యాంక్ పేర్కొన్నాయి. ఇక ఆర్‌బీఐ, ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ 6.5 శాతంగా ఉంటుందని, ఓఈసీడీ, ఫిచ్ రేటింగ్స్ 6.4 శాతానికి పరిమితమవుతుందని అంచనా వేశాయి.
నివేదికలో మరిన్ని విశేషాలు..

☐ అధిక టారిఫ్‌లు, అంతర్జాతీయంగా బలహీన డిమాండ్ కారణంగా ఎగుమతులు నెమ్మదించవచ్చు. అయితే, స్థూల దేశీయోత్పత్తిపై ప్రభావం ఒక మోస్తరుగానే ఉండొచ్చు.

☐ గ్లోబల్ మందగమనంతో ప్రపంచవ్యాప్తంగా వృద్ధి నెమ్మదించినా, పటిష్టమైన ఆర్థిక, ద్రవ్య విధానాల వల్ల భారత్ కాస్త మెరుగైన స్థితిలో ఉండొచ్చు.

☐ ప్రధాన ఎగుమతి దేశాల్లో ఉత్పత్తి సామర్థ్యాలు పెరగడం వల్ల డంపింగ్ రిస్కులు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి భారత్ యాంటీ-డంపింగ్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

☐ గ్లోబల్ అవాంతరాలపై భారత్ వ్యూహాత్మకంగా స్పందించాల్సి ఉంటుంది. వృద్ధికి ఊతమిచ్చే ఆర్థిక విధానాలు, ఉదార ద్రవ్య విధానాల ద్వారా భారత్ ఈ పరిస్థితుల నుంచి పటిష్టంగా బైటపడొచ్చు.

☐ స్వల్పకాలికంగా అమెరికా నుంచి కొంత క్రూడాయిల్ దిగుమతులను పెంచుకోవడం ద్వారా ఆ దేశంతో వాణిజ్య లోటును భర్తీ చేసుకోవడంతో పాటు ప్రతీకార టారిఫ్ రేట్లను కూడా తగ్గిస్తే భారత్‌కు శ్రేయస్కరంగా ఉంటుంది.

☐ 2025 సెప్టెంబర్-అక్టోబర్ నాటికి సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరితే అమెరికాతో వాణిజ్యంలో కాస్త స్థిరత్వం వస్తుంది.

☐ స్వల్పకాలికం నుంచి దీర్ఘకాలిక దృష్టికోణంలో చూస్తే భూ, కార్మిక చట్టాల్లో సంస్కరణలు వేగవంతం చేయాలి. విద్య, ఏఐ.. జెన్‌ఏఐలాంటి కొత్త నైపుణ్యాల్లో శిక్షణపై మరింతగా ఇన్వెస్ట్ చేయాలి. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల స్కీము పరిధిని విస్తరించాలి.



# హింసే నన్ను ఇష్టపడుతోంది!

**విజయవంతమైన 'కేజీఎఫ్' సిరీస్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది నటి శ్రీనిధి శెట్టి. ఇప్పుడామె 'హిట్ : ది థర్డ్ కేస్'తో తెలుగులో తొలి అడుగు వేసేందుకు సిద్ధమైంది.**

విజయవంతమైన 'కేజీఎఫ్' సిరీస్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది నటి శ్రీనిధి శెట్టి. ఇప్పుడామె 'హిట్ : ది థర్డ్ కేస్'తో తెలుగులో తొలి అడుగు వేసేందుకు సిద్ధమైంది. ఆమె.. కథానాయకుడు నాని జంటగా నటించిన ఈ బహుభాషా చిత్రాన్ని శైలేష్ కొలను తెరకెక్కించారు. ఇది మే 1న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్ర విశేషాల్ని విలేకర్లతో పంచుకుంది నటి శ్రీనిధి శెట్టి.

**తెలుగులో మీకిది తొలి సినిమా. దీనికి 'ఏ' సర్టిఫికెట్ రావడం ఎలా అనిపిస్తోంది?**

''నేను కథ విన్నప్పుడే ఇది చాలా హింసతో నిండి ఉన్న యాక్షన్ చిత్రమని అర్థమైంది. నిజానికి ఈ కథకు అంత యాక్షన్ అవసరముంది. ఈ జానరే అలాంటిది. అందుకే దీనికి 'ఏ' సర్టిఫికెట్ వస్తుందని నాకు అప్పుడే అర్థమైపోయింది. దీని గురించి నానితో నేను సరదాగా ఓ మాట అన్నా. మీకు 'ఏ' సర్టిఫికెట్ అందుకోవడానికి 16ఏళ్లు పట్టింది. నేను నా నాలుగో చిత్రంతోనే దాన్ని అందుకున్నా అని సరదాగా చెప్పా. దీని వల్ల ఈసారికి మా సినిమాని 18ఏళ్ల లోపు పిల్లలు చూసే అవకాశం లేకపోయింది. కానీ, మిగతా ప్రేక్షకులంతా దీన్ని చూసి తప్పక ఆదరిస్తారని నమ్ముతున్నా''.

**వరుసగా యాక్షన్ ప్రాధాన్యమున్న కథల్లోనే కనిపిస్తున్నారు? హింస అంటే ఇష్టమా?**

''నేను సున్నిత మనస్కురాలినే. కాకపోతే 'కేజీఎఫ్'లో యశ్ చెప్పినట్లు 'వైలెన్స్ ఐ డోంట్ లైక్ ఇట్.. ఐ అవాయిడ్. బట్ వైలెన్స్ లైక్స్ మీ. ఐ డోంట్ అవాయిడ్' (నవ్వుతూ). అందుకే నేను ఏం చేయలేకపోతున్నా. ముందే చెప్పినట్లు ఇది తొలి సీన్ నుంచే హింసాత్మకంగా చిత్రమేమీ కాదు. ఎక్కడ అవసరమో అక్కడ యాక్షన్ కనిపిస్తుంటుంది. 'కేజీఎఫ్' చిత్రాలకు 'హిట్ 3' పూర్తి భిన్నంగా ఉంటుంది''.

**ఈ 'హిట్ 3' కథేంటి? దీంట్లో అర్జున్ సర్కార్‌తో మీ ప్రయాణం ఎలా సాగుతుంది?**

''అందరూ అనుకున్నట్లు ఇది పూర్తిగా హింసతో నిండిన యాక్షన్ చిత్రమేమీ కాదు. ఇందులో క్రైమ్, ఇన్వెస్టిగేషన్, డ్రామా, యాక్షన్, ప్రేమ.. అన్నీ ఉంటాయి. యాక్షన్ అన్నది ఎప్పుడు అవసరం ఉంటుందో అప్పుడు బయట కొస్తుంటుంది. దీంట్లో అర్జున్ సర్కార్ ఎంత వైలెంట్‌గా, ఫ్రస్టేటెడ్‌గా ఉంటాడో టీజర్, ట్రైలర్లతో అందరికీ అర్థమై ఉంటుంది. అతన్ని శాంతంగా ఉంచే ప్రేయసిగా మృదుల పాత్రలో నేను కనిపిస్తా. ఈ సినిమాలో అర్జున్, మృదుల మాట తప్పితే ఇంకెవరి మాట లెక్క చేయడు. కథలో అవసరమైనప్పుడల్లా నా పాత్ర కనిపిస్తుంటుంది. దీంట్లో నా పాత్రలో మరో ఆసక్తికర కోణం కూడా దాగి ఉంటుంది. అదేంటన్నది సినిమా చూసి తెలుసుకోవాలి''.

**ఈ చిత్రానికి మీరే స్వయంగా డబ్బింగ్ చెప్పుకున్నట్లున్నారు?**

''అవును. ఎంతో ఇష్టంతో కష్టపడి ఆ పని పూర్తి చేశా. నిజానికి నేను ప్రస్తుతం తెలుగులో 'తెలుసు కదా' అనే మరో చిత్రంతో బిజీగా ఉండటంతో 'హిట్' టీమ్ మరో అమ్మాయితో డబ్బింగ్ చెప్పించాలని అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ, తెలుగులో నా తొలి చిత్రానికి సొంత గాత్రమే వినిపించాలని బలంగా నిర్ణయించుకున్నా. వెంటనే దర్శకుడు శైలేష్‌ను కలిసి 'ఒకసారి నేను డబ్బింగ్ చెప్పి చూస్తా.. వాయిస్ నచ్చకపోతే తీసేయ్యమ'ని చెప్పా. కానీ, తనకు నా వాయిస్ నచ్చడంతో నన్నే డబ్బింగ్ చెప్పమని ప్రోత్సహించారు. అలా రోజూ పగలు మరో షూటింగ్‌లో పాల్గొని.. రాత్రి పూట ఈ చిత్రానికి డబ్బింగ్ పూర్తి చేశా. ఈ విషయంలో శైలేష్ నాకెంతో సహకరించాడు. ఏదేమైనా తెలుగులో నా తొలి చిత్రం నా సొంత గాత్రంతో వస్తుండటం చాలా ఆనందాన్నిచ్చింది. ఓ కన్నడ అమ్మాయిలా కాకుండా తెలుగు అమ్మాయిలాగే చాలా సహజంగా డబ్బింగ్ చెప్పా''.

**మీరు 'రామాయణ'లో సీత పాత్రను వదులుకున్నారని విన్నాం. నిజమేనా?**

''లేదు.. ఆ చిత్ర విషయంలో నేను చెప్పింది మీడియాలో మరో రకంగా వెళ్లింది. నేను సీత పాత్రను వద్దనుకున్నాన్నది నిజం కాదు. అలాంటి గొప్ప పాత్రను వద్దనుకోవడాని అసలు నేనెవరు. ఆ పాత్ర కోసం నేను ఆడిషన్ ఇచ్చానన్నది ఒక్కటే నిజం. సాయిపల్లవి, అలియా భట్ లాంటి పెద్ద పేర్ల మధ్యలో నాలాంటి ఓ కొత్త అమ్మాయిని అంత పెద్ద పాత్ర కోసం ఆడిషన్‌కు పిలవడమే నాకు పెద్ద విషయం కదా. నేను వెళ్లాను ఆడిషన్ ఇచ్చాను. కానీ, ఆ తర్వాత వాళ్ల నుంచి మళ్లీ ఫోన్ రాలేదు. ఆ తర్వాత ఆ పాత్రకు అలియా భట్‌ను అనుకున్నట్లు ప్రచారం విన్నా. ఫైనల్‌గా ఆ పాత్ర కోసం సాయిపల్లవిని ఎంపిక చేసుకున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ప్రస్తుతం నేను తెలుగులో సిద్ధు జొన్నలగడ్డతో కలిసి 'తెలుసు కదా' అనే చిత్రం చేస్తున్నా''.

**'కేజీఎఫ్ 3'లో మళ్లీ మీ పాత్రను చూసే అవకాశముందా?**

''దీని గురించి ప్రశాంత్ నీల్‌ని నేనూ అడుగుతూనే ఉన్నా. ఆ మధ్య ముంబయిలో ఓ సినిమా షూట్ సందర్భంగా యశ్‌ను కలిసినప్పుడు సరదాగా దీని గురించి మాట్లాడా. 'కేజీఎఫ్ 2'లో నా పాత్రని చంపేశారు.. ఏంటి 'కేజీఎఫ్ 3' ప్లాన్ అని అడిగా (నవ్వుతూ). ఏమో ఆ మూడో భాగంలో నేను ఉన్నానా? లేదా? అన్నది తెలియాలంటే ఇంకొన్నాళ్లు ఎదురు చూడాల్సిందే''.



# వేవ్స్‌లో 'రామాయణ' ఫస్ట్‌లుక్?

**కెరీర్ ఆరంభం నుంచే కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకులకు చేరువయిన సాయిపల్లవి.. త్వరలో సీతగా తెరపైకి రావడానికి సన్నద్ధమవుతోంది.**

కెరీర్ ఆరంభం నుంచే కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకులకు చేరువయిన సాయిపల్లవి.. త్వరలో సీతగా తెరపైకి రావడానికి సన్నద్ధమవుతోంది. ఆమె, బాలీవుడ్ కథానాయకుడు రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రామాయణ'. నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ వీడియోను మరికొన్ని రోజుల్లో మొదలు కానున్న 'వేవ్స్' సమ్మిట్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ''ఈ ఏడాది శ్రీరామనవమికే ఈ సినిమాకు సంబంధించిన ఓ వీడియోను విడుదల చేయాలని అనుకుంది చిత్రబృందం. కానీ అనుకోని కారణాలతో అది జరగలేదు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దుతున్న 'రామాయణ' పరిచయ వీడియోను ప్రదర్శించేందుకు వేవ్స్ సమ్మిట్ సరైన వేదిక అని నిర్ణయించుకున్నారు. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నార''ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇందులో హీరో యశ్.. రావణుడి పాత్రలో కనిపించనున్నారు.

# చెక్ చేసుకుని.. రీస్టార్ట్ చేయాలి..: బాలీవుడ్ పరిస్థితిపై నాని వ్యాఖ్యలు

**హిట్ 3' తో దక్షిణాదితోపాటు ఉత్తరాదిలోనూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు నటుడు నాని . తాజాగా ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన బాలీవుడ్ ప్రస్తుత పరిస్థితి గురించి మాట్లాడారు. బాలీవుడ్ తిరిగి నిలదొక్కుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.**

: నాని హీరోగా శైలేశ్ కొలను దర్శకత్వం వహించిన చిత్రం 'హిట్ 3' ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన బాలీవుడ్ ప్రస్తుత పరిస్థితి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రతి పరిశ్రమలో ఏదో ఒక సమయంలో ఇలాంటి గడ్డు పరిస్థితులు ఎదురవుతాయని చెప్పారు. బాలీవుడ్ తిరిగి నిలదొక్కుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "బాలీవుడ్ అనే కాదు.. పరిశ్రమ ఏదైనా ఇలాంటి గడ్డు పరిస్థితులు ఎదురుకావడం సహజం. ప్రస్తుతం దక్షిణాది చిత్రాలు అంతటా రాణిస్తున్న మాట వాస్తవమే అయినప్పటికీ.. టాలీవుడ్ కూడా ఇలాంటి రోజులను చూసింది. కొన్ని నెలల పాటు సినిమాలు ఆశించిన ఫలితాలను అందించలేదు. సినిమాలు ఆడక మేము థియేటర్లు మూసి వేసిన సందర్భాల్లూ ఉన్నాయి. అలా, అని కుంగిపోలేదు. మరింత ఉత్సాహం, పట్టుదలతో చిత్రాలు రూపొందించి ప్రేక్షకులకు అందించాం. హిందీలోనూ అదే పరిస్థితి రానుందని భావిస్తున్నా. ఇప్పుడున్న రోజుల్లో భాషతో సంబంధం లేకుండా మంచి చిత్రాలను వీక్షించాలని ప్రతి ఒక్కరూ అనుకుంటున్నారు. గొప్ప చిత్రాలను తెరకెక్కించాలనే ఆశతో ఫిల్మ్ మేకర్స్ వర్క్ చేస్తున్నారు. బాలీవుడ్ ఒకానొక సమయంలో ఎన్నో అద్భుతమైన చిత్రాలు తెరకెక్కించింది. చిన్నతనంలో ఆయా చిత్రాలను మేమంతా వీక్షించాం. కాబట్టి, ఆ పరిశ్రమ మళ్లీ నిలదొక్కుకుంటుంది. ఇలాంటి గడ్డు కాలం ఎదురైనప్పుడు.. ఒక్కసారి ఆగి మనల్ని మనం చెక్ చేసుకుని రీస్టార్ట్ చేయాల్సి ఉంటుంది" అని నాని చెప్పారు.

'హిట్' యూనివర్స్‌లో భాగంగా రూపొందిన మూడో చిత్రమే 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా నాని కనిపించనున్నారు. మే 1న ఈ సినిమా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలను సినిమాపై అంచనాలు పెంచాయి.





# 'ఈడీ' విచారణ: సమయం కోరిన మహేశ్‌బాబు

**చెప్పిన తేదీన విచారణకు హాజరుకాలేకపోతున్నానంటూ మహేశ్‌బాబు ఈడీకి లేఖ రాశారు.**

హైదరాబాద్: ప్రముఖ నటుడు మహేశ్‌బాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి లేఖ రాశారు. షూటింగ్ ఉన్నందున సోమవారం విచారణకు హాజరు కాలేకపోతున్నట్టు అందులో పేర్కొన్నారు. మరో తేదీ కేటాయించాలని ఈడీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సాయిసూర్య డెవలపర్స్, సురానా ప్రాజెక్టు కేసుల్లో కొన్ని రోజుల క్రితం మహేశ్‌బాబుకు ఈడీ నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ రెండు సంస్థలకు ఆయన ప్రచారకర్తగా ఉన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఇన్‌ఫ్లుయెన్స్ చేశారనే అభియోగంపై ఈడీ నోటీసులు జారీ చేసింది.

# చైతూ చిత్రం.. భారీ హంగులతో!

**ఏళ్ల తరబడి ఆలోచనలు... కొన్ని నెలల సన్నద్ధత... ఎన్నో రోజులుగా సాగుతున్న కఠినమైన సాధనతో నాగచైతన్య 24వ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమా ఇదివరకెప్పుడూ లేని ఓ కొత్త అనుభవాన్ని పంచుతుందని చిత్రవర్గాలు స్పష్టం చేస్తున్నాయి.**

ఏళ్ల తరబడి ఆలోచనలు... కొన్ని నెలల సన్నద్ధత... ఎన్నో రోజులుగా సాగుతున్న కఠినమైన సాధనతో నాగచైతన్య 24వ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమా ఇదివరకెప్పుడూ లేని ఓ కొత్త అనుభవాన్ని పంచుతుందని చిత్రవర్గాలు స్పష్టం చేస్తున్నాయి. 'విరూపాక్ష'తో విజయాన్ని అందుకున్న కార్తీక్ దండు దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, సుకుమార్.బి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ ఆరంభానికి ముందు సన్నద్ధతని కళ్లకుకడుతూ ఓ ప్రత్యేకమైన వీడియోను శనివారం విడుదల చేసింది చిత్రబృందం. ఆ వీడియో సినిమా స్థాయిని చాటడంతోపాటు, కథా నేపథ్యాన్ని పరిచయం చేసింది. చైతూ తన పాత్ర కోసం శారీరకంగా, మానసికంగా ప్రత్యేకంగా సిద్ధమై నటిస్తున్నారని, భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం ఆయన కెరీర్‌లోనే ఓ



# కృనాల్ ఆల్‌రౌండ్ షో.. ఢిల్లీపై ప్రతీకారం తీర్చుకున్న ఆర్సీబీ





ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ మెగా టోర్నీలో బాగంగా అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఆర్సీబీ గెలుపొందింది. 163 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 18.3 ఓవర్లలో చేధించింది.

26 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన ఆర్సీబీని కృనాల్ పాండ్యా, విరాట్ కోహ్లి తమ అద్భుత ఇన్నింగ్స్‌లతో విజయతీరాలకు చేర్చారు. కృనాల్ 46 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 73 పరుగులు చేయగా.. విరాట్ 46 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో 51 పరుగులు చేశాడు.

ఆఖరిలో టిమ్ డేవిడ్(5 బంతుల్లో 19) మెరుపులు మెరిపించాడు. ఈ విజయంతో చిన్నస్వామి స్టేడియంలో ఢిల్లీ చేతిలో ఎదురైన పరాభావానికి ఆర్సీబీ బదులు తీర్చుకుంది. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ రెండు వికెట్లు పడగొట్టగా.. చమీరా ఓ వికెట్ సాధించాడు. మరో వికెట్ రనౌట్ రూపంలో లభించింది.



ఇక ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 8 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. ఢిల్లీ బ్యాటర్లలో కేఎల్ రాహుల్(41) టాప్ స్కోరర్‌గా నిలవగా.. స్టబ్స్(34),ఫాఫ్ డుప్లెసిస్(22), అభిషేక్ పోరెల్(28) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ మూడు వికెట్లు పడగొట్టగా.. హాజిల్‌వుడ్ రెండు, దయాల్, పాండ్యా తలా వికెట్ సాధించారు. ఈ విజయంతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానికి చేరుకుంది.






# లఖ్‌నవూను బెంబేలెత్తించిన బుమ్రా.. ముంబయి వరుసగా ఐదో విజయం

**లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ 54 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.**

ముంబయి: ఐపీఎల్ 18 సీజన్‌లో తొలుత తడబడ్డ ముంబయి ఇండియన్స్ ఇప్పుడు వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఆదివారం వాంఖడే స్టేడియం వేదికగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి 54 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. హార్దిక్ సేనకు వరుసగా ఇది ఐదో గెలుపు. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో లఖ్‌నవూ సరిగ్గా 20 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (34; 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (27; 15 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), ఆయుష్ బదోని (35; 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), డేవిడ్ మిల్లర్ (24; 16 బంతుల్లో 3 ఫోర్లు) దూకుడుగా ఆడినా భారీ స్కోర్లు చేయలేకపోయారు. ఐడెన్ మార్‌క్రమ్ (9), రిషభ్ పంత్ (4), అబ్దుల్ సమద్ (2) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ముంబయి బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా (4/22) లఖ్‌నవూ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. ఇన్నింగ్స్ ఆరంభంలో మార్‌క్రమ్‌ను ఔట్ చేసి లఖ్‌నవూకు గట్టి షాక్ ఇచ్చిన బుమ్రా.. 16 ఓవర్‌లో మిల్లర్, సమద్, అవేశ్ ఖాన్ (0)ని పెవిలియన్‌కు పంపాడు. ట్రెంట్ బౌల్ట్ (3/20) కూడా అదరగొట్టాడు. విల్ జాక్స్ 2, కోర్బిన్ బాష్ ఒక వికెట్ పడగొట్టారు. లఖ్‌నవూకు 10 మ్యాచ్‌ల్లో ఇది ఐదో ఓటమి.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబయి.. ఓపెనర్ ర్యాన్ రికెల్‌టన్ (58; 32 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (54; 28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ శతకాలతో చెలరేగడంతో భారీ స్కోరు సాధించింది. ఎదుర్కొన్న తొలి రెండు బంతులను సిక్స్‌లుగా మలిచి ఊపుమీద కనిపించిన రోహిత్ శర్మ (12; 5 బంతుల్లో) త్వరగానే నిష్క్రమించాడు. విల్ జాక్స్ (29; 21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. తిలక్ వర్మ (6), హార్దిక్ పాండ్య (5) నిరాశపర్చారు. చివర్లో నమన్ ధీర్ (25*; 11 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కోర్బిన్ బాష్ (20; 10 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు మెరిపించారు. లఖ్‌నవూ బౌలర్లలో మయాంక్ యాదవ్ 2, అవేశ్ ఖాన్ 2, దిగ్వేశ్ సింగ్ రాఠీ, ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# టీమ్ఇండియా ఆల్‌రౌండ్ షో.. శ్రీలంకపై ఘన విజయం

**ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా ఆదివారం శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.**



కొలంబో: శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్ (శ్రీలంక, భారత్, సౌతాఫ్రికా)లో టీమ్ఇండియా (మహిళా జట్టు) శుభారంభం చేసింది. సిరీస్‌లో భాగంగా ఆదివారం శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 39 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక భారత బౌలర్ల ధాటికి 38.1 ఓవర్ల వద్ద 147 పరుగులకు ఆలౌటైంది. ఈ టార్గెట్‌ని టీమ్ఇండియా 29.4 ఓవర్లలోనే ఛేదించింది. ప్రతీకా రావల్ (50*; 62 బంతుల్లో 7 ఫోర్లు) అర్ధ శతకం సాధించగా.. హర్లీన్ డియోల్ (48; 71 బంతుల్లో 4 ఫోర్లు), స్మృతి మంధాన (43; 46 బంతుల్లో 6 ఫోర్లు) రాణించారు.



తొలుత భారత బౌలర్ల ధాటికి లంక బ్యాటర్లలో ఎవరూ భారీ స్కోరు చేయలేకపోయారు. ఓపెనర్ హాసిని పెరెరా (30) టాప్ స్కోరర్. కవీషా దిల్హరి (25), అనుష్క సంజీవని (22), అచ్చిని కులసూర్యహర్షిత మాధవి (14), నీలాక్షి డి సిల్వా (10) పరుగులు చేశారు. టీమ్ఇండియా బౌలర్లలో స్నేహ్ రాణా 3, నల్లపురెడ్డి చరణి 2, దీప్తి శర్మ 2, అరుంధతి ఒక వికెట్ తీశారు.



# చరిత్ర సృష్టించేందుకు అడుగు దూరంలో ఉన్న రోహిత్ శర్మ

ముంబై ఇండియన్స్ స్టార్ ఆటగాడు రోహిత్ శర్మ ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించేందుకు అడుగు దూరంలో ఉన్నాడు. ఐపీఎల్ 2025లో భాగంగా ఇవాళ (ఏప్రిల్ 27) మధ్యాహ్నం లక్నోతో జరుగబోయే మ్యాచ్‌లో హిట్‌మ్యాన్ మరో 5 సిక్సర్లు బాదితే ఐపీఎల్‌లో 300 సిక్సర్లు పూర్తి చేసుకున్న తొలి భారతీయ బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పుతాడు.

ప్రస్తుతం రోహిత్ ఖాతాలో 295 సిక్సర్లు (265 మ్యాచ్‌ల్లో) ఉన్నాయి. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు క్రిస్ గేల్ ఒక్కడే 300 సిక్సర్లు మార్కును తాకాడు. గేల్ 142 మ్యాచ్‌ల్లో 357 సిక్సర్లు బాదాడు. గేల్, రోహిత్ తర్వాత ఐపీఎల్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన రికార్డు విరాట్ కోహ్లి పేరిట ఉంది. విరాట్ 261 మ్యాచ్‌ల్లో 285 సిక్సర్లు కొట్టాడు.

ఐపీఎల్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన టాప్5 బ్యాటర్లు
క్రిస్ గేల్ 357
రోహిత్ శర్మ 295
విరాట్ కోహ్లి 285
ఎంఎస్ ధోని 260
ఏబీ డివిలియర్స్ 251

ఓవరాల్‌గా టీ20 క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన రికార్డు కూడా క్రిస్ గేల్ పేరిటే ఉంది. గేల్ ఈ ఫార్మాట్‌లో 1056 సిక్సర్లు బాదాడు. ప్రపంచంలో గేల్ మినహా ఏ క్రికెటర్ 1000 సిక్సర్ల మార్కును తాకలేదు. గేల్ తర్వాత కీరన్ పోలార్డ్ రెండో స్థానంలో ఉన్నాడు. పోలీ తన టీ20 కెరీర్‌లో 908 సిక్సర్లు బాదాడు.

గేల్, పోలీ తర్వాత రసెల్ (737), పూరన్ (630) అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాళ్ల జాబితాలో ఉన్నారు. పొట్టి క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన టాప్4 బ్యాటర్లు విండీస్ ఆటగాళ్లే కావడం విశేషం. ఈ జాబితాలో టీమిండియా స్టార్ రోహిత్ శర్మ ఏడో స్థానంలో, విరాట్ కోహ్లి 20వ స్థానంలో ఉన్నారు. రోహిత్ తన టీ20 కెరీర్‌లో 540 సిక్సర్లు బాదగా.. విరాట్ 429 సిక్సర్లు కొట్టాడు.

టీ20ల్లో అత్యధిక సిక్సర్లు బాదిన టాప్10 ఆటగాళ్లు
క్రిస్ గేల్ 1056
కీరన్ పోలార్డ్ 908
ఆండ్రీ రసెల్ 737
నికోలస్ పూరన్ 630
కొలిన్ మున్రో 557
అలెక్స్ హేల్స్ 552
రోహిత్ శర్మ 540
గ్లెన్ మ్యాక్స్‌వెల్ 530
జోస్ బట్లర్ 528
డేవిడ్ మిల్లర్ 505

ఇదిలా ఉంటే, ముంబైలోని వాంఖడే మైదానం వేదికగా ఇవాళ మధ్యాహ్నం ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ తలపడుతున్నాయి. ప్లే ఆఫ్స్‌కు చేరే క్రమంలో నేటి మ్యాచ్ ఇరు జట్లకు చాలా కీలకంగా మారింది. ప్రస్తుతం ముంబై, లక్నో తలో 10 పాయింట్లు (9 మ్యాచ్‌లు) సాధించి పాయింట్ల పట్టికలో ఐదు, ఆరు స్థానాల్లో ఉన్నాయి. గుజరాత్ (12), ఢిల్లీ (12), ఆర్సీబీ (12), పంజాబ్ (11) టాప్4లో ఉన్నాయి.

